## క్లుప్తంగా

### నేడు రేషన్‌కార్డుల పంపిణీ

**ఆమనగల్లు:** పట్టణంలోని రైతు వేదికలో సోమవారం అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ లలిత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొని రేషన్‌కార్డులు పంపిణీ చేస్తారని ఆమె తెలిపారు.

### నేడు ఎమ్మెల్యే పర్యటన

**కడ్తాల్:** మండల కేంద్రంలో సోమవారం ఉదయం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సభావట్ బీచ్యానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా చెట్లు నాటే కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు, ఎంబీఏ గార్డెన్‌లో నూతన రేషన్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. పార్టీశ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

### స్ఫూర్తి ప్రదాత కలాం

ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి



కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న భాస్కర్‌రెడ్డి తదితరులు

**కడ్తాల్:** భవిష్యత్ తరాలకు మార్గదర్శకుడు, యువతకు స్ఫూర్తి ప్రదాత భారత రత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం అని మార్కెట్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడురు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కలాం దేశానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు జహంగీర్‌బాబా, లక్పతినాయక్, జహంగీర్‌అలీ, యాదగిరిరెడ్డి, నరేశ్‌నాయక్, ఇమ్రాన్‌బాబా, శంకర్, మల్లేశ్‌గౌడ్, కేశవులు, సుధాకర్, రాజేందర్‌గౌడ్, ఉపేందర్, అజ్గర్‌అలీ, ప్రవీణ్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

### కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహ్మద్ బాబా

**మాడ్గుల:** సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తన మాటలను వెనక్కు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహ్మద్ బాబా డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అహర్నిషలు రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రిపై హుజూరాబాద్ ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ మెప్పు కోసం ఆయన దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాడన్నారు. భవిష్యత్‌లో రెచ్చగొట్టే మాటలు, తప్పుడు ప్రచారం చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

### ఎమ్మెల్యేపై ఫిర్యాదు



ఏసీపీ రాజుకు ఫిర్యాదు చేస్తున్న యువజన కాంగ్రెస్ నేతలు

**ఇబ్రహీంపట్నం:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సికిందర్‌రెడ్డితో పాటు పలువురు నేతలు స్థానిక ఏసీపీ కేపీవీ రాజు, సీఐ మహేందర్‌రెడ్డిలకు ఆదివారం ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

### వేదాద్రిలో సామూహిక వ్రతాలు



వ్రతానికి హాజరైన ప్రభాకర్‌రెడ్డి తదితరులు

**ఆమనగల్లు:** తలకొండపల్లి మండలం వెల్జాలలో వేదాద్రి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రతాలను ఆచరించారు. శ్రావణమాసం ప్రారంభం కావడంతో ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ పూజా కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు శ్రీనివాసమూర్తి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఏళ్లుగా అవే తిప్పలు

- రేకుల షెడ్డులో తరగతుల నిర్వహణ
- అసౌకర్యాల నడుమ విద్యార్థుల అవస్థలు
- శిథిలావస్థలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం



రేకుల షెడ్డులో తరగతులు నిర్వహిస్తున్న బస్టాండ్ ఉన్నత పాఠశాల



నిరుపయోగంగా మరుగుదొడ్లు

**ఆమనగల్లు:** పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు కనీస వసతులకు కరువై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీని ఫలితంగా నానాటికీ విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. పాఠశాలకు సొంత భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కొన్నేళ్లుగా కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. విద్యార్థుల సమస్యలు తీర్చాలని కోరుతున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**గాయపడిన విద్యార్థి**

పట్టణానికి దాదాపు 4 దశాబ్దాల క్రితం ప్రాథమికోన్నత పాఠశాల మంజూరైంది. అప్పట్లో సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో నిర్వహించారు. తర్వాత 3 దశాబ్దాల క్రితం బస్టాండ్‌ను ఆనుకుని ఉన్న పాత ఆస్పత్రి భవనంలోకి పాఠశాలను మార్చారు. 15 ఏళ్ల క్రితం ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. పాత ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవనం పూర్తిగా శిథిలం కావడంతో గతేడాది తరగతి గది పైకప్పు పెచ్చులు ఊడిపడటంతో ఒక విద్యార్థి గాయపడ్డాడు. ఆ తరువాత శిథిలావస్థలో ఉన్న భవనంలో తరగతుల నిర్వహణ ఇబ్బందికరంగా మారడంతో దాతల సహకారంతో పాఠశాల ఆవరణలో నూతనంగా రేకుల షెడ్డు నిర్మించి తరగతులను నిర్వహిస్తున్నారు. శౌచాలయాలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

**వెనక్కి మళ్లిన నిధులు**

పాఠశాలలో ప్రస్తుతం 6 నుంచి 10వ తరగతి వరకు తరగతులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 78 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ప్రస్తుతం పాఠశాలలో 8 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఒక టీచర్ పోస్టు ఖాళీగా ఉంది. కాగా బస్టాండ్ ఉన్నత పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరడంతో 11 ఏళ్ల క్రితం సొంత భవనానికి రూ.25లక్షలు మంజూరయ్యాయి. అయితే పాఠశాల కొనసాగుతున్న స్థలం మండల పరిషత్ ఆధీనంలో ఉండటంతో పాఠశాల భవన నిర్మాణానికి అప్పట్లో అనుమతి ఇవ్వలేదు. దీంతో నిధులు వెనక్కి మళ్లాయి. ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాల స్థలంలోనే నూతన భవనం నిర్మించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

> **అధికారులకు తెలిపా**
>
> 
>
> ఉన్నత పాఠశాలకు సొంత భవనం నిర్మించాలని అధికారులకు విన్నవించాం. ప్రస్తుత భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అయినప్పటికీ పాఠశాలలో విద్యార్థులు సంఖ్య పెంపునకు కృషి చేయడంతో పాటు నాణ్యమైన విద్య అందిస్తున్నాం.
>
> – పద్మ, ప్రధానోపాధ్యాయురాలు, జెడ్పీహెచ్ఎస్, ఆమనగల్లు

### విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

**ఆమనగల్లు:** తలకొండపల్లి మండలం ఖానాపూర్ సమీపంలోని జామియ ఇస్లామియా దారుల్ ఉలుం కైసల్ మదర్సా పాఠశాల విద్యార్థులకు ఆదివారం పట్టణానికి చెందిన మైనార్టీ నాయకుడు సయ్యద్ ఖలీల్ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మదర్సా ప్రిన్సిపాల్ మౌలానా అబ్దుల్ కరీం షా ఖాద్రి, నాయకులు మహబూబ్, ఫారుక్, రఫీ, హనీఫ్, నిజాముద్దీన్, బాబా, అబ్బు, ఖలీం, అప్సర్, అజీం, హఫీజ్, అఫ్రోజ్, హైమద్, ముస్తఫా, ఇర్ఫాన్, షోయబ్, సాహెయిల్, మేరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మదర్సా విద్యార్థులతో మైనార్టీ నాయకులు

### కాలనీ ముఖద్వారం ప్రారంభం



ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు

**అబ్దుల్లాపూర్‌మెట్:** పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని 4వ వార్డులో గల ఆపిల్ అవెన్యూ కాలనీ, వెంకటేశ్వర కాలనీలకు సంబంధించిన ముఖద్వారాన్ని ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావతి, కాలనీల అధ్యక్షులు డి.నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు వడ్డేపల్లి విజయేందర్‌రెడ్డి, జక్క సంజీవరెడ్డి, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

# సల్లంగా చూడమ్మ.. ముత్యాలమ్మా



కడ్తాల్: బోనాల ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు



కడ్తాల్: బోనంతో యువతి



ఇబ్రహీంపట్నం రూరల్: బోనాల ఊరేగింపులో కుటుంబ సభ్యులతో నిరంజన్‌రెడ్డి



కడ్తాల్: సేవాలాల్ చిత్రపటాన్ని గుర్రంపై ఊరేగిస్తున్న గిరిజనులు

**కడ్తాల్:** మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాలో గిరిజనులు ముత్యాలమ్మ బోనాల పండుగను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తండాలోని గిరిజన మహిళలు పసుపు, కుంకుమలతో చూడముచ్చటగా అలంకరించిన బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా డీజే, డప్పు దరువుల హోరు, యువతి యువకుల నృత్యాలు, కోలాటలు, గిరిజన మహిళల సంప్రదాయ నృత్యాలు, పోతురాజుల వేషధారణ, విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, రామునాయక్, మాజీ ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్‌నాయక్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

**ఘనంగా పోచమ్మ బోనాలు**

**ఇబ్రహీంపట్నం రూరల్:** ఆదిబట్ల మున్సిపాలిటీలో పోచమ్మ బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మహిళలు బోనాలను తయారు చేసి అమ్మవారికి సమర్పించారు. మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నిత్యా, మాజీ వైస్ చైర్మన్ కోరే కళమ్మ, కోఆప్షన్ సభ్యులు పల్లె గోపాల్‌గౌడ్, మాజీ సర్పంచులు ఈసీ శేఖర్‌గౌడ్, రాజు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం



వైద్య శిబిరంలో సంఘం నాయకులు

**మంచాల:** గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సక్రమంగా వినియోగించుకోవాలని వీర శైవ లింగాయత్ లింగబలిజ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.కె.భిక్షపతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ సహకారంతో వీర శైవ లింగయాత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా మహాత్మా బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. శిబిరంలో 70 మందికి వైద్య పరీక్షలు చేశామన్నారు. వారిలో 22 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. మరో 14 మందికి కంటి ఆపరేషన్లు చేయాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, శేఖరప్ప, హరీశ్, అనిల్‌కుమార్, ఆనందప్ప, విశ్వనాథ్, ప్రవీణ్, సోమేశ్వర్, ఈశ్వరప్ప, పెంటప్ప, సతీష్, నాగభూషన్, పరమేష్, రాజప్ప, కోటప్ప తదితరులు పాల్గొన్నారు.

# బొడ్రాయి పండగలో ఎమ్మెల్యే పూజలు



బొడ్రాయి ఉత్సవాల్లో ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు

**ఇబ్రహీంపట్నం:** గ్రామాల్లో పండుగలను ప్రశాంత వాతావరణంలో కలిసిమెలసి నిర్వహించుకోవాలని స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని రాయపోల్ గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి(నాభిశిల) వార్షికోత్సవం, బోనాల ఊరేగింపులో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ.. అమ్మవారి కరుణ, కటాక్షాలు ప్రజలపై ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు. ఎంతో వైభవంగా సీతలదేవి, పోచమ్మ, మైసమ్మ అమ్మవార్లకు మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆ దృశ్యాలు చూపరులను కట్టి పడేశాయి. కార్యక్రమంలో గడ్డి అన్నారం, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్లు చిలుక మధుసూదన్‌రెడ్డి, కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, రాష్ట్ర సేవాదళ్ ఉపాధ్యక్షుడు మంఖాల దాసు, మార్కెట్ వైస్ చైర్మన్ కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, జంగారెడ్డి, రాములు, ప్రభాకర్‌రెడ్డి, సికిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మలుపులు.. ప్రమాదాలకు నెలవులు



నానక్‌నగర్-పిల్లిపల్లి గ్రామాల మధ్య ప్రమాదకరంగా మూలమలుపు



చింతుల్ల-కొలన్‌గూడెం గ్రామాల మధ్య..

**చెట్లకొమ్మలు పెరగడంతో కనిపించని వాహనాలు**

**యాచారం:** మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల్లోని మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. వర్షాలు కురుస్తుండడం, రోడ్లపై చెట్ల కొమ్మలు గుబురుగా పెరగడంతో అడుగుల దూరంలో సైతం ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. యాచారం-నస్దిక్‌సింగారం, మాల్-మంతన్‌గౌరెల్లి, తక్కళ్లపల్లిగేట్-నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్-తాడిపర్తి, నందివనపర్తి-పిల్లిపల్లి, చింతుల్ల-కొనల్‌గూడ, పెద్దతుల్ల-గునుగల్ గేట్ ఇలా పలు గ్రామాలకు వెళ్లే దారుల్లో మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. నాలుగు రోజుల కింద గునుగల్ అటవీ ప్రాంతంలోని పెద్దతుల్ల-గునుగల్ గేట్ మధ్యలో అటవీ శాఖకు చెందిన జీపు బోల్తా పడి ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పిల్లిపల్లి-నానక్‌నగర్ గ్రామాల మధ్యన ఉన్న మూలమలుపు వద్ద గత పక్షం రోజుల కింద రెండు బైకులు ఢీకొన్నాయి. ముగ్గురి ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. నందివనపర్తి-నస్దిక్‌సింగారం గ్రామాల మధ్యన చెరువు కట్ట సమీపంలో మూలమలుపు వద్ద రోడ్డు కిరువైపులా చెట్లు అధికంగా పెరగడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా రోడ్డు, భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు గాని, హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

> **వాహనాల రాక గుర్తించలేం**
>
> 
>
> నానక్‌నగర్-పిల్లిపల్లి గ్రామాల మధ్యన మూల మలుపు అత్యంత ప్రమాదకరంగా మారింది. గతంలో ఇదే చోట పలు ప్రమాదాలు జరిగాయి. ఓ ప్రైవేట్ బస్సు మూలమలుపు వద్ద ఉన్న వ్యవసాయ బావిలో పడిపోయింది. బస్సుల్లో ఉన్న 20 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. అధికారులు తక్షణమే స్పందించి నివారణ చర్యలు చేపట్టాలి.
>
> – పెద్దయ్య, మాజీ సర్పంచ్, నానక్‌నగర్

### మన్‌కీబాత్ వీక్షించిన నేతలు

**షాద్‌నగర్:** ప్రధాని మోదీ ప్రసంగించిన మన్‌కీబాత్ కార్యక్రమాన్ని ఆదివారం పట్టణ నాయకులు వీక్షించారు. పట్టణంలోని 250వ బూత్‌లోని శ్రీనగర్‌కాలనీలో గల న్యాయవాది శ్యాంసుందర్ నివాసంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ప్రధాని సందేశాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లే విధంగా నాయకులు స్ఫూర్తిదాయకంగా ముందుకు సాగాలని పలువురు సూచించారు. ప్రధాని ప్రసంగం నాయకులు, కార్యకర్తల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్‌పటేల్, నాయకులు మల్చలం మురళీ, వంశీకృష్ణ, శేరి విష్ణువర్ధన్‌రెడ్డి, కాసోజు శివ, నర్సింలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

**షాద్‌నగర్‌రూరల్:** కూతురును బస్టాండ్‌లో విడిచి పెట్టేందుకు వెళ్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కూతురు మృతి చెందడం బాధాకరమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని బీజేపీ లీగల్ సెల్ సభ్యుడు శ్యాంసుందర్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శంషాబాద్‌లో బీటెక్ చదువుతున్న మైత్రిని బస్టాండ్‌లో వదిలిపెట్టేందుకు తండ్రి మఛ్చందర్ తన బైక్‌పై ముఖ్య కూడలి నుంచి వెళ్తున్న క్రమంలో వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో తండ్రి, కూతురు అక్కడికక్కడే మరణించారన్నారు. రాష్ట్ర రాజధానికి షాద్‌నగర్ కూతవేటు దూరంలో ఉండటం, పరిశ్రమలు ఏర్పడటంతో నిత్యం వాహనాల రద్దీతో వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. ముఖ్యకూడలి ఇరుకుగా ఉండటంతోనే అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎంతోమంది మృత్యువాత పడుతున్నారన్నారు. ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులు స్పందించి ముఖ్య కూడలిని వెడల్పు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని సందర్భాలలో సిగ్నల్స్ పడినా ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ముఖ్యకూడలిలో తప్పనిసరిగా ట్రాఫిక్ పోలీసులు ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బైపాస్ రహదారిపై ఉన్న కేశంపేట, దూసకల్ ముఖ్య కూడళ్లలో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆయా ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు నిర్మించి ప్రమాదాలను నివారించాలని కోరారు. లేకపోతే పెద్దఎత్తున ధర్నా చేపట్టేందుకు బీజేపీ నేతలు సిద్ధంగా ఉన్నారన్నారు.

### భక్తిశ్రద్ధలతో సీత్లా పండుగ

**ఆమనగల్లు:** మండల పరిధిలోని శంకరకొండ తండాలో ఆదివారం గిరిజనులు సీత్లాపండుగను ఘనంగా నిర్వహించారు. గిరిజన మహిళలు నైవేద్యం ఊరేగింపుగా తీసుకెళ్లి సీత్లామాతకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో యువతీయువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సీత్లా పండుగలో చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్లి రాములు, మాజీ సర్పంచ్ లక్ష్మీశంకర్, తండావాసులు పత్యానాయక్, ప్రశాంత్‌నాయక్, విజయ్‌రాథోడ్, నాయక్ శ్రీను, వసురాంనాయక్, జైపాల్, నరేశ్‌నాయక్, జాను, ప్రవీణ్, సందీప్, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.



శంకరకొండతండాలో సీత్లా పండుగలో యువకుల సందడి



యువతుల నృత్యాలు



నైవేద్యంతో యువతి